## క్లుప్తంగా

### అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**బూర్గంపాడు/భద్రాచలంటౌన్:** బూర్గంపాడు మండలం చెరువుసింగారం గిరిజన రైతుల భూముల్లో పత్తిమొక్కలు పీకి ధ్వంసం చేసిన ఫారెస్ట్ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మిడియం బాబురావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో బాధిత రైతులతో కలసి గురువారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. అనంతరం పీఓ రాహుల్‌ను కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి, బత్తుల వెంకటేశ్వర్లు, కుంజా శ్రీనివాస్, రాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో బాధితురాలి పత్తిచేనును సందర్శించారు. పార్టీ నాయకులు మువ్వ వెంకటేశ్వరరావు, పేరాల శ్రీనివాస్,సబ్కా నాగేశ్వరరావు, అలవాల సీతారామిరెడ్డి, సిద్దారపు సుబ్బారెడ్డి, పాండవుల బిక్షం పాల్గొన్నారు.

### పొదెం పర్యటన

**దుమ్ముగూడెం:** మండలంలోని పలు గ్రామాల్లో అటవీశాఖ అభివృద్ధి చైర్మన్ పొదెం వీరయ్య గురువారం పర్యటించి కార్యకర్తలను, అభిమానులతో సంభాషించారు. ముసలిమడుగు, సీతానగరం (నడిగడ్డ) గ్రామాల్లో పర్యటించి పరామర్శలు చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరమాచినేని వినిల్, ఉపాధ్యక్షులు తెల్లం హరికృష్ణ, నటరాజ స్వామి,నాయకులు తెల్లం వరలక్ష్మి, తెల్లం భీమరాజు, జిల్లా మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ కనుబుద్ది దేవ తదితరులు పాల్గొన్నారు.

### బదిలీ అధికారికి సన్మానం

**మణుగూరుటౌన్:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–2 పీఓగా పనిచేసి పదోన్నతిపై ఎస్టేట్స్ హెచ్ఓడీగా బదిలీ అవుతున్న లక్ష్మీపతిగౌడ్‌ను ఆపరేటర్లు గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌డీ నాజర్ పాషా మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం పీఓగా పనిచేసి మణుగూరు ఏరియాను చరిత్రలో ఉన్నత స్థాయిలో నిలిపారన్నారు. కార్యక్రమంలో కార్మికులు సీహెచ్ క్రాంతి కుమార్, గఫూర్ పాషా, మెహబూబ్, రాజయ్య, శ్రీనివాస్, యాదగిరి, తిరువూరు అశ్విన్ మణితేజ, మునిగెల పృధ్వి, సయ్యద్ ఆసిఫ్, మున్వర్, శ్రీనివాసమూర్తి, కర్నె సారయ్య, సీహెచ్.కామేశ్వరరావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

### దొడ్డ రమేష్‌కు ‘గురుబ్రహ్మ’ అవార్డు

**అశ్వాపురం:** మండల కేంద్రంలోని రవీంద్ర పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ దొడ్డ రమేష్‌కు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ బాధ్యులు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురుబ్రహ్మ అవార్డు ప్రకటించారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రమేష్‌ను పలువురు అభినందించారు.

### సమస్యలు పరిష్కరించాలి

**మణుగూరురూరల్:** జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట 14 గ్రామ పంచాయతీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఎంపీడీఓ టి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు రంగా సదానందం, సారిక, పి.రాములు, మంగమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**కరకగూడెం:** సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు కొమరం కాంతారావు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ సంఘం గౌరవ అధ్యక్షులు గుమ్మడివెల్లి కృష్ణ, మండల అధ్యక్షులు గాంధర్ల ధనంజయ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### భద్రగిరి ఈఓ పూజలు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ఈఓ కె.దామోదరరావు స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

### బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా మహేష్

**మణుగూరురూరల్:** బహుజన సమాజ్ పార్టీ పినపాక నియోజవకర్గ అధ్యక్షుడిగా కొప్పెర మహేష్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తడికల శివకుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కాళిమాత ఏరియాలో జరిగిన సమావేశంలో మహేష్‌కు ఆయన నియామకపత్రం అందజేశారు.

### ఉపసంహరించుకోవాలి..

**ములకలపల్లి:** పత్తి వంటపై ప్రభుత్వం రద్దు చేసిన 11 శాతం పన్ను జీఓను వెంటనే ఉపసంహరించుకోవాలని, దిగుమతిపై 50 శాతం పన్ను విధించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకుడు నకిరకంటి నాగేశ్వరరావు, తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి నూపా భాస్కర్ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌ఎంకే) ఆధ్వర్యంలో మండలకేంద్రంలో గురువారం జీఓ ప్రతులను దహనం చేశారు.

# దిగుబడికి యూరియా గండం

- ప్రభావం చూపుతున్న కొరత
- దాటిపోతున్న సమయం.. లోపిస్తున్న మొక్కల ఎదుగుదల
- ఇదిలానే కొనసాగితే పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం


ఎర్రబారుతున్న వరి చేను..


ఎదుగుదల లేక కంకి లేని మొక్కజొన్న చేను

**గుండాల:** నిన్న మొన్నటి వరకు వర్షాలు లేక రైతులు దిగులు చెందారు. ఇప్పుడు వానలు సమృద్ధిగా కురుస్తున్నాయి.. పంటలకు ఇక రందే లేదనుకున్నారు.. కానీ సకాలంలో, సరిపడా పంటలకు అందాల్సిన యూరియా అందకపోవడంతో ఆశించిన మేరకు దిగుబడులు రాకపోవచ్చునని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉమ్మడి గుండాల మండలంలో సుమారు 60 వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న, 10వేల ఎకరాలలో పత్తి, సుమారు 20 వేల ఎకరాల్లో వరి, మరో 5వేల ఎకరాల్లో మిర్చి పంటలను సాగు చేస్తున్నారు. అయితే, సాగు మొదలెట్టి మూడు నెలలు కావస్తున్నప్పటికీ.. పంట ఎదుగుదల లేదని రైతులు వాపోతున్నారు.

**సరిపడా అందని యూరియా..**

ఓ పక్క అధికారులు యూరియా కొరత లేదని అంటున్నా.. రైతులు మాత్రం తమకు సరిపడా అందలేదని అంటున్నారు. ఎకరానికి రెండు బస్తాలు మాత్రమే వేయాలని అధికారులు సూచిస్తున్నారు. కానీ పోడు వ్యవసాయం ఎక్కువగా ఉండడంతో సరిపడా యూరియా వేయలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. యూరియాకు బదులుగా నానో యూరియా పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారులు సూచన మేరకు నానో యూరియా పిచికారి చేస్తే పచ్చదనం వస్తుందే తప్పా ఎదుగుదల లేదు. దీంతో యూరియా కోసమే రైతులు సొసైటీల ముందు పడిగాపులు ఉండాల్సిన పరిస్థితి. ఇప్పటికే అదును దాటి పోతోందని, ప్రైవేటుగా కూడా యూరియా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పంటలపై ప్రతికూల ప్రభావం**

మూడు నెలలో మొక్కజొన్న చేతికందాల్సి ఉండగా.. ఎదుగుదల లేక కొంత ఎత్తులోనే తలెన్న దశకు చేరుకుంది. అక్కడక్కడ పీచులు తీయగా కంకిలో నాణ్యత లేదని అంటున్నారు. ఇక వరి చేన్లు సైతం ఎర్రబారుతున్నాయి. పొట్ట దశకు వచ్చే సరికి రెండు దఫాలుగా యూరియా వేయాల్సి ఉంటుంది. కానీ దుక్కిమందుతోనే రైతులు సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఇక పూత దశకు చేరాల్సిన పత్తి చేన్లు ఎదుగుదల లేక అడుగు మేరనే పెరిగాయి. ఎక్కువ కాత రావడం లేదు. ఇప్పుడిప్పుడే మిర్చి నాటుతున్నారు. కానీ యూరియా లేక ఈ పంట రైతులకూ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఈ సారి ఆశించినంత పంట దిగుబడులు రావడం కష్టమని రైతులు అంటున్నారు.

**‘పోడు’గోస వేరు..**

పోడు సాగులో ఉన్న పూర్తి భూమి లెక్కలు అధికారుల రికార్డుల్లో లేకపోవడం వల్ల ఏజెన్సీ రైతుల గోస మరింత జఠిలంగా తయారైంది. అధికారుల లెక్కల ప్రకారం గుండాల మండలంలో మొక్కజొన్న, పత్తి, మిర్చి, వరి 40వేల ఎకరాలలో సాగవుతోంది. కానీ అనధికారికంగా సుమారు 50 వేల ఎకరాలకు పైనే సాగుచేస్తున్నారు. ఆళ్లపల్లి మండలంలో సైతం సుమారు 40వేల ఎకరాలలో సాగు చేస్తున్నారు. అయితే అధికారుల దృష్టిలో అంత మొత్తంలో భూమి సాగులో లేదు కాబట్టి.. ఇప్పటి వరకు సరఫరా అయిన యూరియా సరిపడా అందుతుందనే చెబుతున్నారు. అనధికారికంగా సాగవుతున్న పంటలు, వాటికి అందాల్సిన యూరియాపై వీరికి పట్టింపు లేకుండా పోయింది. వెరసి ఏజెన్సీ రైతులకు యూరియా తిప్పలు అధిక స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది.

### వరి ఎర్రబారుతోంది..



సకాలంలో వేయాల్సిన ఎరువు.. అందుబాటులో లేక వేయకపోవడంతో వరి చేన్లు ఎర్రబడుతున్నాయి. మొక్కజొన్న ఎదుగుదల లేదు. కంకి గింజలు సరిగ్గా రావడం లేదు. ఎరువు లేకపోవడంతో బలం లేక కంకులు సరిగ్గా రావడం లేదు. పత్తి పరిస్థితి కూడా అంతే ఉంది.

– సన్న గోవిందు, నర్సాపురం

### ఉపయోగపడని నానో యూరియా



నానో యూరియా పిచికారీ చేసినా ఉపయోగం లేదు. పచ్చదనం వస్తుందే తప్పా ఎదుగుదల లేదు. దీనికితోడు సాధారణ యూరియా లాగా.. నానో యూరియాపై పూర్తి స్థాయిలో చాలా మందికి అవగాహన లేదు. యూరియా సరిపడా ఇస్తేనే పంటలు దిగుబడులు వస్తాయి.

– తెల్లం భాస్కర్, గుండాల

# గర్భిణికి ప్రాణాపాయస్థితి..

ఏరియా ఆస్పత్రిలో చేర్పించి కాపాడిన వైద్యాధికారులు


బాధితురాలిని పరామర్శిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ సైదులు తదితరులు

**భద్రాచలంఅర్బన్:** దుమ్ముగూడెం మండలం ఆర్లగూడేనికి చెందిన గర్భిణి భవాని స్థానికంగా ఓ ఆర్ఎంపీ వద్ద వైద్యం పొందుతోంది. వైద్యులు ఇచ్చిన డెలివరీ డేట్ ప్రకారం గర్భిణి ప్రసవించకపోవడంతో సదరు ఆర్ఎంపీ కమీషన్ కోసం ఆశపడి భద్రాచలం అంబేడ్కర్ సెంటర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న భద్రాచలం వైద్యారోగ్య శాఖ అధికారులు ఆమెను ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించగా అప్పటికే కడుపులో బిడ్డ మృతిచెందినట్లు తేలింది. దీంతో ఆపరేషన్ చేసి మృతశిశువుని బయటకి తీసి భవానికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న బాలింతను కాపాడిన ఆస్పత్రి వైద్యులను ఐటీడీఏ పీఓ రాహుల్ అభినందించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య గురువారం ఆమెను పరామర్శించారు. ఈ ఘటనపై ఐటీడీఏ పీఓ స్పందిస్తూ వైద్యం కోసం ఆర్ఎంపీల వద్దకు వెళ్లొద్దని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని చెప్పారు. ఆర్ఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కార్యరూపం దాల్చని వాగ్దానాలు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

**కరకగూడెం:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసిందని, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్పందన గార్డెన్స్‌లో నిర్వహించిన కరకగూడెం, ఆళ్లపల్లి, గుండాల మండలాల పార్టీ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగులు ఎదురుచూస్తున్న పథకాలు ఇంకా గమ్యం చేరలేదని, పలు సమస్యలు ప్రజలకు మరిత భారంగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని, ఈ నెల 10, 11 తారీకుల్లోని కేసీఆర్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు రేగా కాళికా, కొండ్రు మంజు భార్గవి, పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, నాయకులు అక్కిరెడ్డి వెంకటరెడ్డి, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**అశ్వారావుపేటరూరల్:** నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, రహదారి విస్తరణ, మెగా డ్రెయినేజీ నిర్మాణాలను మరింత వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచించారు. గురువారం ఎమ్మెల్యే ఆయా పనులను పరిశీలించి, సూచనలు చేశారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను జాప్యం చేయవద్దన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నార్లపాటి సత్యవతి(63) అనారోగ్యంతో మృతి చెందగా.. ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి సత్యవతి చిత్ర పటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఆ తర్వాత మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, నార్లపాటి రాములు పాల్గొన్నారు.

# మండపాల వద్ద అన్నదానాలు

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మండపాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవ కమిటీల బాధ్యులు దాతల సహకారంతో భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు. పలువురు ప్రముఖులు పాల్గొని ప్రారంభించగా.. భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. కొన్ని చోట్ల మేళతాళాల నడుమ వినాయకులను ఊరేగించి, ఆపై చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: పెద్దగొల్లగూడెంలో భక్తులకు వడ్డన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

### పోలీసుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ

**ములకలపల్లి:** మండలకేంద్రలోని పీఏసీఎస్ వద్ద ఎరువు కోసం భారీగా రైతులు రావడం, కౌంటర్ ఏర్పాటు చేసిన గది ఇరుకుగా ఉండడ, రశీదుల కోసం అందరూ ఒక్కసారిగా రావడంతో గురువారం స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఎస్, మధుప్రసాద్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఎస్సై కౌంటర్ వద్ద ఉండి స్వయంగా రశీదులు అందించారు. ఎస్సై చొరవ చూపడంతో ప్రశాంతగా అమ్మకాలు జరిగాయి.

### ముగిసిన క్రీడాపోటీలు

**భద్రాచలంటౌన్:** స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన మండల స్థాయి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల క్రీడ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓ టి.రమ విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఉద్యోగ అవకాశాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ డిప్యూటీ మేనేజర్ చెంగళరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుజాత, పద్మ, సత్యనారాయణ, రవికుమార్, రమణ, రమేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మణుగూరురూరల్: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

**మణుగూరురూరల్:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం మణుగూరులోని శ్రీవిద్య జూనియర్ కళాశాలలో మణుగూరు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కొత్త చట్టాలు, నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు మొబైల్ ఫోన్‌లలో కానీ, ఇంటికి వచ్చి కానీ తమ వివరాలను కానీ, బ్యాంక్ ఖాతా వివరాలను, ఓటీపీలను చెప్పాలని అడిగితే నమ్మొద్దని సూచించారు. మొబైల్ ఫోన్లను వచ్చే తెలియని లింకులను, ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయొద్దన్నారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ నాగబాబు, పోలీస్‌సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పినపాక:** మండలంలోని యువత, విద్యార్థులు మత్తుకు బానిస కావద్దని ఈ వయ్యారం ఎస్సై సురేష్ తెలిపారు. గురువారం బయ్యారం క్రాస్ రోడ్ లో సైబర్ క్రైమ్స్, గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత చెడు వేసినాలకు బానిస కాకుండా విద్య, ఉపాధిపై దృష్టి పెట్టాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించి, చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ


ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరుటౌన్:** సమితిసింగారం పంచాయతీ కార్యాలయంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరవ్వగా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మరో 1000 ఇవ్వాలని కోరగా.. మంజూరు చేశారన్నారు. అనంతరం రూ.14.80 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను 33 మంది లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షుడు నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, కూచిపూడి బాబు, గోరంట్ల కనకయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

### ల్యాబ్‌లు సీజ్

సాక్షి ఎఫెక్ట్..

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రక్త పరీక్షల ల్యాబ్‌లను వైద్యశాఖ అధికారులు సీజ్ చేశారు. గురువారం ‘సాక్షి’లో ‘పీఓ ఆదేశాలు బేఖాతర్’శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి రెండు డయాగ్నస్టిక్స్ సెంటర్ల చర్యలు తీసుకున్నారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు, డిప్యూటీ డీఎంహెచ్ఓ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

**కలప ట్రాక్టర్..**

**దమ్మపేట:** అక్రమంగా కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని అచ్యుతాపురం క్రాస్ రోడ్డు వద్ద ఫారెస్టు అధికారులు బుధవారం అర్ధరాత్రి సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ఆంధ్రాకు కలప తరలిస్తుండగా వాహనాన్ని పట్టుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

**ఇసుక లారీ..**

**బూర్గంపాడు:** కిన్నెరసాని నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని గురువారం పోలీసులు సీజ్ చేశారు. మోరంపల్లిబంజరకు సమీపాన సీతారామ కెనాల్ వద్ద ఇసుక లారీని తనిఖీ చేయడంతో అనుమతి పత్రాలు లేవని తేలగా.. పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ మేడ ప్రసాద్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ గణపతి, యజమాని ఓనర్ చిట్టెమ్మపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

**కాంగ్రెస్ నాయకుడి మృతి**

**గుండాల:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తిరుక్కొవళ్లూరి (పట్వారి) రామయ్య(90) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. 1977 నుంచి గుండాల పట్వారీగా పనిచేసిన ఆయన.. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వచ్చాడు. ఆయన మృతదేహానికి పార్టీ మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. రామయ్య మృతి పార్టీకి, మండలానికి తీరని లోటని పలువురు నాయకులు, ప్రముఖులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

### విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు చర్యలు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం గోదావరి ఘాట్‌లో నిమజ్జనం చేసేందుకు వచ్చే వినాయకుడి విగ్రహాల కారణంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదాలు చోటుచేసుకోకుండా భద్రాచలం విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. విగ్రహాల ఊరేగింపు ప్రాంతాల్లో ఎత్తైన విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

**108 శివ లింగాలకు అభిషేకాలు**


అభిషేకంలో పాల్గొన్న మహిళలు

**దుమ్ముగూడెం:** మండలంలోని లక్ష్మీనగరం గ్రామం దాసాంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం శివ నాగ స్వామి అర్చకులచేత మహిళలు 108 శివ లింగాలకు పంచామృతాలతో అభిషేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు.

**10కిలోల విప్పపువ్వు లడ్డూ సమర్పణ**


డ్రైఫ్రూట్స్ విప్పపువ్వు లడ్డూ అందజేస్తున్న భక్తులు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సెంటర్‌లోని యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలోని మట్టి గణపయ్యకు 10 కేజీల డ్రైఫ్రూట్స్ విప్పపువ్వు లడ్డూను గురువారం పట్టణానికి చెందిన బోర పెద్దిరెడ్డి అనే భక్తుడు అందించి మొక్కును తీర్చుకున్నాడు. కార్యక్రమంలో పి. శ్రీకాంత్ రెడ్డి, మల్లెల లోకేష్ కుమార్, శీరపు సాయి సంపత్ రెడ్డి, ఆకుల వెంకట్, బెల్లంకొండ పుష్పగిరి పాల్గొన్నారు.

# ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో గురువారం ముందస్తుగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బందికి పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలను విద్యార్థులు అందజేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. గురువు స్థానం, విశిష్టతను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: నారంవారిగూడెంలో ఉపాధ్యాయులను సన్మానించిన తల్లిదండ్రులు


మణుగూరురూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులకు సన్మానం..


భద్రాచలంటౌన్: ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డీడీ మణెమ్మ, తదితరులు


దమ్మపేట: అంకంపాలెం డిగ్రీ గురుకులం ప్రిన్సిపాల్‌కు మొక్క అందజేస్తున్న విద్యార్థులు


అశ్వారావుపేటరూరల్: ఎంఈఓ ప్రసాదరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ


అన్నపురెడ్డిపల్లి: ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంఈఓ ఆనంద్‌కుమార్


మణుగూరుటౌన్: ఉపాధ్యాయుల వేషధారణలో బ్రైట్ మైండ్స్ ప్లేస్కూల్ విద్యార్థులు..